www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 11 నవంబర్ 2025

5

ఏలూరు

నేడు పలు యూనిట్లకు సిఎం వర్చువల్ శంకుస్థాపన

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలోని రెండు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ఈ నెల 11వ తేదీన సిఎం చంద్రబాబు వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారని, ఒక ఎంఎస్ఎంఇ పార్క్‌ను వర్చువల్‌గా ప్రారంభిస్తారని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. ఈ నెల 11వ తేదీ ఉదయం 10.30 గంటలకు కనిగిరిలో సిఎం చేపట్టే కార్యక్రమంలో జిల్లాలోని ద్వారకాతిరుమల మండలం సిహెచ్.పోతేపల్లిలో రూ.208 కోట్లతో ఏర్పాటు కానున్న గోద్రేజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్‌ను, నూజివీడు మండలం మోర్సపూడిలో రూ.110 కోట్లతో ఏర్పాటు కానున్న రమణసింగ్ గ్లోబల్ ఫుడ్‌పార్క్‌లకు సిఎం వర్చువల్‌గా శంఖుస్థాపన చేస్తారన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో 20 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఇ పార్క్‌ను కూడా సిఎం ప్రారంభించనున్నట్లు తెలిపారు.

చూసెళ్లారు..!

- కేంద్ర బృందం పర్యటనలో మాటామంతీ కరువు
- పంట దెబ్బతిన్న రైతుల మొర వినని అధికారుల బృందం
- ఇదేమిటని పెదవి విరిచిన తుపాన్ బాధిత రైతులు
- రూ.72 కోట్లు మేర నష్టం : కలెక్టర్ కె.వెట్రిసెల్వి

దెబ్బతిన్న వరి కంకులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

ప్రజాశక్తి - ఉంగుటూరు

మొంథా తుపాను పంట నష్టం అంచనా వేసేందుకు మండలంలో కేంద్ర బృందం పర్యటించిన తీరుపై బాధిత రైతులు పెదవి విరుస్తున్నారు. రైతులతో మాట్లాడకుండా, పంట దెబ్బతిన్న రైతుల మొర వినకుండా, పొలాలు, ఫొటోలు చూసి వెళ్లిపోవడం ఏమిటని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన పంటలను పరిశీలించేందుకు జిల్లాకు విచ్చేసిన కేంద్ర బృందం సోమవారం సాయంత్రం ఉంగుటూరు మండలంలో పర్యటించింది. బృందంలో కేంద్ర వ్యవసాయ శాఖ, రైతు సంక్షేమ డైరెక్టర్ కె.పొనుస్వామి, సెంట్రల్ వాటర్ కమిషన్ డైరెక్టర్ శ్రీనివాస్‌బాబ్రి, కేంద్ర విద్యుత్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ అర్తీసింగ్, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మనోజ్‌కుమార్ మీనా సభ్యులుగా ఉన్నారు. ముందుగా కుళ్లిపోయి, ఎండిపోతున్న వరి పంటను పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులు దాదాపు 50 మంది వరకూ వచ్చినా వారితో కేంద్ర బృందం మాట్లాడలేదు. స్థానిక నీటి సంఘం అధ్యక్షుడు బి.ప్రసాద్ కేంద్ర బృందానికి వరి పంట నష్టం తీరును వివరించారు. చేలో పడిపోయిన వరి పంట దుబ్బులను పైకి తీసి అధికారుల బృందానికి ఇచ్చేందుకు అధికారులు సరైన ఏర్పాట్లు చేయలేదు. బృందం పర్యటన కవరేజీకి వచ్చిన మీడియా ప్రతినిధులే వరి దుబ్బులను తీసి అధికారులకు అందించడం గమనార్హం. రైతుల ఇబ్బందులు, వారి గోడు కేంద్ర బృందానికి చెప్పుకునేలా ఏర్పాట్లు చేయడంపై జిల్లా అధికారులు ఎందుకు సారించలేదో అర్థం కావడం లేదని పలువురు రైతు నేతలు ఆవేదన వ్యకతం చేశారు. రంగు మారిన ధాన్యాన్ని ఎలా కొనుగోలు చేస్తారు, ఎంతమేరకు తీసుకుంటారనే విషయాలను జిల్లా పౌరసరఫరాల శాఖాధికారులను కేంద్ర బృందం ఆరా తీసింది. రంగు మారిన ధాన్యం తేమ శాతం ఎలా లెక్కిస్తారనేది ఆర్ఎస్‌కె సిబ్బంది నమూనా చూపారు. అనంతరం దెబ్బతిన్న పంటల స్టాల్‌ను బృందం తిలకించింది. అనంతరం నారాయణపురం-గణపవరం రోడ్డులో దుర్గమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన పంట నష్టాల ఫొటో ఎగ్జిబిషన్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం కేంద్ర బృందం తూర్పుగోదావరి జిల్లా పర్యటనకు వెళ్లిపోయింది. ఈ బృందం వెంట వ్యవసాయ శాఖ రాష్ట్ర కమిషనర్ ఢిల్లీరావు, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌కె.హబీబ్ భాషా, ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, ఎడిఎ పి.ఉషారాజకుమారి, మండల వ్యవసాయాధికారి డాక్టర్ ఎన్ఎస్.ప్రవీణ్‌కుమార్, గ్రామ సర్పంచి దిడ్ల అలకనంద, వివిధ శాఖల ఉన్నతాధికారులు, కూటమి నాయకులు ఉన్నారు.



కలెక్టర్‌కు వినతి అందిస్తున్న నేతలు

వరికి రూ.25 వేలు, వాణిజ్య పంటలకు రూ.50 వేలు పరిహారం ఇవ్వాలి

మొంథా తుపాను తాకిడికి గోదావరి, కృష్ణా డెల్టా ప్రాంతంలో వరి పంట బాగా దెబ్బతిందని, వరికి ఎకరాకు రూ.25 వేలు, వాణిజ్య పంటలకు రూ.50 వేలు పరిహారం ఇవ్వాలని కోరుతూ ఎపి రైతుసంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యాన జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రం అందించారు. 2010లో తుపాను, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలకు పంట నష్టానికి ఎకరాకు రూ.10 వేలు ఇవ్వాలని భూపేంద్ర సింగ్ హూడా కమిటీ నివేదిక ఇచ్చిందని, ఆ నివేదిక ఇచ్చి 15 సంవత్సరాలు దాటిందని నేతలు గుర్తు చేశారు. నాటికి, నేటికి పెట్టుబడి ఖర్చులు పెరిగాయని, ఎకరాకు వరికి రూ.25 వేలు, వాణిజ్య పంటలకు రూ.50 వేలు పరిహారం ఇవ్వాలని కోరారు. ఆయా సంఘాల నేతలు కోనా శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ, నారపల్లి రమణారావు, సీరా అప్పారావు, కానూరి రాజు డిమాండ్ చేశారు.

రూ.72 కోట్లు మేర నష్టం

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

మొంథా తుపాన్ కారణంగా ఏలూరు జిల్లాలో రూ.72 కోట్ల విలువైన పంట నష్టం వాటిల్లిందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. కేంద్ర బృంద పర్యటన అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 5703 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. అధిక శాతం వరి పంట దెబ్బతిందన్నారు. 17.60 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని, బొప్పాయి, అరటి పంటలు ఎక్కువగా దెబ్బతిన్నాయని తెలిపారు. జిల్లా యంత్రాంగం ముందస్తు జాగ్రత్త చర్యల కారణంగా తుపాన్ సందర్భంగా ఎటువంటి ప్రాణ నష్టం సంభవించలేదన్నారు. 19 ఇళ్లు దెబ్బతిన్నాయని, ఒక గేదె, 4 గొర్రెలు మరణించాయని తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే 3422 మంది ప్రజలను తుపాను పునరావాస కేంద్రాలకు తరలించి, భోజనం, వసతి సౌకర్యాలు కల్పించామన్నారు. పునరావాస కేంద్రాల నుండి ఇళ్లకు వెళ్లిన బాధితులకు నిత్యావసర సరుకులతోపాటు, కుటుంబానికి రూ.3 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించామన్నారు.

పిజిఆర్ఎస్ వినతులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు

పిజిఆర్ఎస్‌లో 306 అర్జీలు రాక



వినతులు స్వీకరిస్తున్న డిఆర్ఒ విశ్వేశ్వరరావు

ప్రజాశక్తి - ఏలూరు

పిజిఆర్ఎస్‌లో అందిన ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలని డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లాస్థాయి అధికారులతో డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు నిర్వహించారు. డిఆర్ఒతోపాటు డిప్యూటీ కలెక్టర్ ఎల్.దేవకిదేవి, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ఎం.ముక్కంటి, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్, సర్వే శాఖ ఎడి అన్సారీ స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ పిజిఆర్ఎస్‌లో ప్రజల నుండి అందిన ప్రతి అర్జీని అధికారులు క్షుణ్ణంగా అధ్యయనం చేసి, నాణ్యమైన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చిన అర్జీల్లో కొన్నింటి వివరాలు ఇలా ఉన్నాయి. ముదినేపల్లి మండలం శ్రీహరిపురానికి చెందిన సీర్ల ఎలియబాబు తన దరఖాస్తులో తన పొలం పక్కనే చేపల చెరువుకు అనుమతి తీసుకుని రొయ్యల చెరువు వేశారని, దీని కారణంగా తన పొలంలో పంటలు పండటం లేదని, తనకు న్యాయం చేయాలని తహశీల్దార్‌ను కోరిన పట్టించుకోలేదని, తనకు న్యాయం చేయాలని కోరారు. ఏలూరు కొబ్బరితోట నివాసులు తమ ప్రాంతంలోని వినాయకుడి గుడి వీధిలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజి నిమిత్తం తవ్విన గోతులను మట్టితో పూడ్చారని, రోడ్డు పాడై తాము ఇబ్బందులు పడుతున్నామని, రోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరారు. కొయ్యలగూడెం మండలం ఎర్రంపేటకు చెందిన పరిమి సతీష్ తదితరులు తాము మినీ గోకులం షెడ్లు నిర్మించుకున్నా బిల్లులు చెల్లించలేదని, వెంటనే బిల్లులు మంజూరు చేయాలని కోరారు. మొత్తంగా సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో 306 అర్జీలు వచ్చాయి.

ఘాతుకం

- తల్లిని, తమ్ముడిని హత్య చేసిన కసాయి
- మానసిక సమస్యలే కారణమని ప్రాథమిక అంచనా
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పి

మహాలక్ష్మి (ఫైల్‌ఫొటో)

రవితేజ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - భీమవరం టౌన్

'హలో.. 112. పోలీస్ సమాచార కేంద్రమేనా. నా పేరు గునుపూడి శ్రీనివాస్. నేను, నా తల్లిని, తమ్ముడిని కత్తితో నరికి హత్య చేశాను. ఎక్కడకు వచ్చి లొంగిపోమంటారు'. ఇవీ జిల్లా కేంద్రమైన భీమవరంలో జంట హత్యలకు పాల్పడిన నిందితుడు పోలీసులకు ఫోన్ చేసి మాట్లాడిన మాటలు. దీంతో అప్రమత్తమైన పోలీసులు హుటాహుటీన సంఘటనా స్థలికి రావడం, పోలీసుల హడావుడితో సోమవారం తెల్లవారేసరికి జంట హత్యల విషయం పట్టణం వాసులకు తెలిసింది. కన్న కొడుకే తల్లిని, ఆపై తమ్ముడిని నిద్రలోనే నరికి చంపడం, తానే పోలీసులకు ఫోన్ చేసి చెప్పడం తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

నిందితుడు శ్రీనివాస్

వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సుంకరపద్దయ్య వీధిలో మన్నా చర్చి ఎదురుగా ఉన్న ఇంట్లో గునుపూడి మహాలక్ష్మి (60), ఆమె కుమారులు శ్రీనివాస్, రవితేజ (33) నివాసం ఉంటున్నారు. అయితే కరోనాకు ముందు రవితేజ వేరే ప్రాంతంలో ఉద్యోగం చేసేవాడు. కరోనా సమయంలో ఇంటికొచ్చేసి ఇక్కడే ఉంటున్నాడు. అదే సమయంలో తండ్రి కరోనా బారిన పడి మృతి చెందారు. దీంతో తండ్రి చేసే ఫైనాన్స్ వ్యాపారం దెబ్బతినడం, ఇతర కారణాల రీత్యా శ్రీనివాస్, రవితేజకు వివాహం కాలేదు. ఇటీవలకాలంలో శ్రీనివాస్ బయటకు వెళ్లినప్పుడల్లా ఎవరోకరితో గొడవ పెట్టుకుని రావడం పరిపాటిగా మారింది. ఈ విషయం తెలుసుకున్న తమ్ముడు, తల్లి శ్రీనివాస్‌ను తరచూ మందలిస్తున్నారు. శ్రీనివాస్ వైఖరిలో పెద్దగా మార్పు రాకపోవడంతో అతడిని బయటికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంచుతున్నారు. ఆదివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో గాఢ నిద్రలో ఉన్న తల్లి, తమ్ముడిపై పైశాచికంగా కత్తితో దాడి చేసి హత్య చేశాడు. ఈ విషయాన్ని సోమవారం తెల్లవారుజామున శ్రీనివాసే పోలీసులకు ఫోన్ చేసి తెలపడంతో బాహ్యప్రపంచానికి విషయం తెలిసింది.

ఘటన స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పి

పట్టణంలో జంట హత్యలు జరిగిన ప్రదేశాన్ని జిల్లా ఎస్పి అద్నాన్ నయీం అస్మీ సోమవారం ఉదయం సందర్శించారు. హత్యలు జరిగిన ఇంట్లో ప్రత్యేకంగా ఆధారాల సేకరణకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. క్లూస్ టీం, పోలీస్ జాగిలం రంగంలోకి దిగి ఆధారాలు సేకరించాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి అద్నాన్ నయీం అస్మీ మాట్లాడుతూ శ్రీనివాస్ తన తల్లిని, తమ్ముడిని హత్య చేశాడని సమాచారం రాగానే ఘటనా స్థలికి సిబ్బంది చేరుకుని ఆధారాలు సేకరించారన్నారు. కరోనా సమయంలో తండ్రి చనిపోయిన తర్వాత శ్రీనివాస్ మానసికంగా ఇబ్బంది పడుతున్నట్లు ప్రాథమిక అంచనాకొచ్చినట్లు తెలిపారు. అయితే అతని సోదరికి సమాచారం ఇచ్చామని తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఎస్పి వెంట డిఎస్పి జైసూర్య, సిఐ నాగరాజు, సిబ్బంది ఉన్నారు.

గండిగూడెం రోడ్డు అభివృద్ధి చేయాలని ఆందోళన

ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

టి.నరసాపురం పంచాయతీలోని గండిగూడెం ప్రధాన రహదారి అభివృద్ధికి నిధులు మంజూరు చేసి, పనులు చేపట్టాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం రోడ్డుపై నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపెద్ద కొరివి శేషారావు గ్రామస్తులతో కలిసి మాట్లాడుతూ తమ గ్రామంలో సుమారు 450కిపైగా కుటుంబాలు వ్యవసాయం ప్రధాన వృత్తిగా జీవిస్తున్నామన్నారు. రోడ్డు గుంతల మయంగా మారడంతో ప్రయాణానికి ఇబ్బంది కలుగుతుందని, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ రావాలన్నా వచ్చే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి రోడ్డు అభివృద్ధి చేయాలని, అంతేకాకుండా బస్సు సౌకర్యం పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాగం వెంకటేశ్వరరావు, మన్యం వెంకటేశ్వరరావు, కొరివి వెంకటేశ్వరరావు, కొరివి నాగేశ్వరరావు, పిన్నిబోయిన వెంకటేశ్వరరావు, సత్తెనపల్లి వినోద్, రాగం సత్యనారాయణ, పొదిల రామారావు, పొదిల చిన్ని, ఊడా కునయ్య, కొండపల్లి రాము, కొరివి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిర్మల

గుంతలు లేని రహదారుల నిర్మాణానికి చర్యలు

జిల్లా రోడ్లు, భవనాలు ఎస్ఇ నిర్మల

ప్రజాశక్తి - మండవల్లి

గుంతలు లేని రహదారులు నిర్మించే విధంగా పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టామని జిల్లా రోడ్లు, భవనాలు ఎస్ఇ నిర్మల స్పష్టం చేశారు. మండలంలోని పెద్దట్ల గాడి సిద్ధాంతం రహదారిని ఆమె అధికారులతో కలిసి పర్యటించి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గంలోని గ్రామాల్లో గుంతలు లేని రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో మరమ్మతులకు గురైన రహదారులను మరమ్మతు చేసే విధంగా నివేదిక సిద్ధం చేశామని తెలిపారు. రహదారులపై ఉన్న గుంతల మరమ్మతులు చేయదగిన అవకాశాలకు పరిశీలిస్తున్నామని చెప్పారు. ఆమెతో పాటు డిఇ అనిల్ కుమార్, ఎఇ భాస్కర్, మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యపు గింజనూ కొంటాం

ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు

ధాన్యం రవాణా వ్యవస్థను ప్రారంభిస్తున్న ఆప్కాబ్ ఛైర్మన్, ఎంఎల్ఎ

ప్రజాశక్తి - భీమడోలు

ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు సోమవారం పని ప్రారంభించాయి. తొలి కేంద్రంగా గుర్తింపు పొందిన గుండుగొలను రైతు సేవా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఎంఎల్ఎ పి.ధర్మరాజుతో పాటు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరు ధాన్యం తేమ కొలిచే యంత్రం పనితీరును పరిశీలించారు. తేమ శాతాన్ని గుర్తించే విధానాన్ని భీమడోలు వ్యవసాయాధికారి ఉషారాణి తెలిపారు. అనంతరం వారు రైతులతో మమేకమై వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఆ తరువాత నియోజకవర్గం నుంచి మిల్లులకు తరలించే రవాణా వ్యవస్థను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు ధాన్యం తరలించే విషయమై ఇబ్బందులు ఏర్పడితే తన దృష్టికి తేవాలని కోరారు. ఎంఎల్ఎ ధర్మరాజు మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. దీనికోసం అవసరమైన ఏర్పాట్ల గురించి తెలిపారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకుంటే రైతులను ఆదుకునేందుకు టార్పాలిన్లను రైతు సేవా కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచామన్నారు. రైతుల అవసరాల మేరకు నాణ్యమైన గోనెసంచులు సిద్ధం చేశామన్నారు. కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన ధాన్యం కొనుగోలు మొత్తాలను అందించిందన్నారు. వచ్చే వ్యవసాయ సీజన్ కు అవసరమైన నాణ్యమైన విత్తనాలను సిద్ధం చేయాలని వ్యవసాయ అధికారులు ఆదేశించారు. ఎంటియు 126 వరి రకం కొనుగోలులో కొన్ని ఇబ్బందులు ఏర్పడుతున్న దృష్ట్యా వ్యవసాయ అధికారులు ప్రత్యామ్నాయలు సిద్ధం చేయాలని కోరారు. వ్యవసాయ శాఖ భీమడోలు సహాయ సంచాలకులు రాజకుమారి మాట్లాడుతూ మండలంలో సాగు జరిగిన 12,943 ఎకరాల నుంచి 72,241 టన్నుల ధాన్యం ఉత్పత్తి జరుగుతుందని అంచనాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గుండుగొలను సొసైటీ అధ్యక్షులు సిరి బత్తిన కొండబాబు, భీమడోలు తహశీల్దార్ రమాదేవి పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి

పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

సరిహద్దుల గుండా ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్ర ప్రాంతంలోని పలు ర్యాంపుల నుంచి సరిహద్దు ప్రాంతాల వారి పేరు మీద బిల్లులు తీసుకుని తెలంగాణ రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారని తెలిపారు. అటువంటి దందాలో పలువురు తన పేరు వాడుతూ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. అక్రమ రవాణాకు పాల్పడే వారిని సహించేది లేదని, సరిహద్దుల గుండా పోలీస్ భద్రత పెంచాలని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు బొర్రంపాలెం విద్యార్థులు

ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు బొర్రంపాలెం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ ఆలీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ పాఠశాలకు చెందిన ఆర్.సంధ్య, సిహెచ్.చైతన్య, బి.ప్రేమ్‌కుమార్ ఈ నెల 8న గోపన్నపాలెంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు ఈ నెల 22వ తేదీన అనకాపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పెదపాడు విద్యార్థులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ప్రజాశక్తి - పెదపాడు (దెందులూరు)

స్కిల్ కాంపిటీషన్స్, క్రీడా పోటీల్లో పెదపాడు కాకరాల చంద్రశేఖరరావు జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై తమ సత్తాను చాటుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో జరిగిన అభినందన సభకు అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల ఏడో తేదీన పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రమైన ఏలూరులో స్కిల్ కాంపిటీషన్స్ జరిగాయన్నారు. వృత్తి విద్యకు సంబంధించి పది విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో తమ పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు నాలుగు ప్రాజెక్టులు తయారు చేసి పోటీల్లో పాల్గొన్నారన్నారు. వీటిలో రెండు ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయన్నారు. బ్యాంకింగ్ సిస్టం, టైప్స్ ఆఫ్ ఇన్సూరెన్స్ అనే ప్రాజెక్టులను తమ పాఠశాల విద్యార్థులు కె.అక్షయ, వి.చంద్రశ్రీ, ఎన్.రుద్రసాయితేజ, ఆర్.కావ్యశ్రీ తయారు చేశారన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

ఈ నెల ఎనిమిదో తేదీన దెందులూరు మండలం గోపన్నపాలెంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 14 ఏళ్ల లోపు విభాగంలో జరిగిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన రాపాక శ్యాంసుందర్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. విజేతలైన విద్యార్థులతో పాటు వారికి సహకరించిన పాఠశాల పీడీ కె.నీలవేణి, ఐటి ఉపాధ్యాయులు భాషా, రాజేష్‌లను హెచ్ఎం వెంకటేశ్వరరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

చేప ధర డీలా!

- పెరిగిన పెట్టుబడులు
- మోయలేనంతగా మేత ఖర్చు
- నష్టాల బాటలో చేపల రైతులు

ప్రజాశక్తి - కాళ్ల

రొయ్యల సాగే కాదు.. లాభాలు సంపాదించి పెడుతుందని భావించిన చేపల సాగు కూడా రైతులకు ప్రస్తుతం భారంగా మారింది. కార్తీక మాసం కావడంతో తెల్ల చేపలు కట్టు, శీలావతి, ఫంగస్, రూప్‌చంద్ వంటి పలు రకాల చేపల ధరలు తగ్గుముఖం పట్టాయి. కొల్లేరు, ఉప్పుటేరు, సముద్ర తీరప్రాంతాల్లో శీలావతి, ఫంగస్, రూప్‌చంద్ వంటి రకాల చేపలను సాగు చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాల వరకూ చేపల సాగు సాగుతోంది.

చేపల సాగు చేసే రైతులు గడ్డు పరిస్థితి ఎదుర్కొంటున్నారు. కొన్నాళ్లుగా పెరుగుతున్న పెట్టుబడులు, క్షీణిస్తున్న ధరలతో ఈ రంగం సంక్షోభంలోకి వెళ్తోంది. దశాబ్ద కాలంగా చేపల సాగులో ఉన్న వారు సైతం నిరాశలో ఉన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఒకవైపు చేపల ధర తగ్గడంతోపాటు మరోవైపు ఫీడ్ ధరలు విపరీతంగా పెరగడంతో పెట్టుబడి ఖర్చులు కూడా రాని పరిస్థితులు నెలకొన్నాయని రైతులు వాపోతున్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు చేపల పట్టుబడులు చేస్తున్నారు. ఇదే అదునుగా తీసుకుని చేపల కొనుగోలుదారులు ధర తగ్గించేస్తున్నారని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే క్రమంలో దిగుమతులు సైతం తగ్గుముఖం పట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరువుల్లో కేజీన్నరకుపైగా బరువు పెరిగిన చేపలు పట్టుబడులు చేస్తున్నారు. ఆకివీడు, భీమవరం, కైకలూరు, గణపవరం పరిసర ప్రాంతాల నుంచి దేశంలో అనేక ప్రాంతాలకు సుమారు 200 లారీల సరుకు ప్రతిరోజూ ఎగుమతి అవుతుంది. ఫీడ్ ధరలు ఆకాశాన్నంటడంతో చేపల సాగు అయోమయంలో పడిపోయింది. దీంతో సిరులు కురిపించిన తెల్ల చేప ఇప్పుడు నష్టాల ఊబిలోకి నెడుతోంది. గతంలో కిలో చేప ధర రూ.125 ఉండేది. ప్రస్తుతం రూ.118కి తగ్గింది. రూప్‌చంద్ గతంలో రూ.120 ఉండేది. ప్రస్తుతం రూ.83కు తగ్గింది. అయితే పెట్టుబడులు మాత్రం రెండు రెట్లు పెరిగాయి.

చేపల మేతైన డిఒబి తవుడు పది టన్నులు రూ.1.20 లక్షలు ఉండేది. ఒక్కసారిగా రూ.50 వేలు పెరిగి ప్రస్తుతం రూ.1.70 లక్షలకు చేరింది. చేపలు కిలో నుంచి కిలోన్నర వచ్చేందుకు సుమారు ఆరు నెలల సమయం పడుతుంది. ఎకరం చెరువులో మూడు వేల వరకు చేప పిల్లలు వదులుతారు. చేప కిలో బరువు పెరిగేందుకు ఐదు కిలోల మేత తింటుంది. చేప ధర తగ్గడం, మేత ధరలు ఒక్కసారిగా పెరిగిపోవడంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. ఇక చెరువుల లీజు ధరలు ప్రస్తుతం పెరిగాయి. ఎకరం చేపల చెరువు లీజు ధర రూ.1.20 లక్షలు ఉంది. గతంలో రూ80 నుంచి రూ.90 వేలు మధ్య ఉండేది. రొయ్యల సాగు చేసే చెరువుల్లోనే చేపల సాగు చేస్తుండటంతో చెరువు లీజు ధరలు పెరిగాయి.

తవుడు (డిఒబి) ధర తగ్గించాలి

మంతెన పెద నరసింహమూర్తిరాజు, చేప రైతు, కలవపూడి



తవుడు (డిఒబి) ధరను తగ్గించాలి. చేపల సాగులో నీటి కాలుష్యంతో పలు రకాల వ్యాధులు ఆశించడం, మరోవైపు ఫీడ్ ధరలు కూడా విపరీతంగా పెరగడంతో పెట్టుబడి ఖర్చులు రాని పరిస్థితి ఏర్పడింది. చేపలు, రొయ్యల సాగు లాభాల దిశగా సాగినప్పుడు ప్రభుత్వానికి రూ.కోట్లలో విదేశీ మారకద్రవ్యం రూపంలో ఆదాయం సమకూరింది. చేపల రైతులు ప్రస్తుతం నష్టాలతో సతమతమవుతున్న తరుణంలో టిడిపి కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలబడేలా చర్యలు తీసుకోవాలి.

బాధిత కుటుంబానికి ఉపాధ్యాయుల చేయూత

ప్రజాశక్తి - భీమడోలు

తమ శాఖలో చేస్తున్న చిరు ఉద్యోగి ఒకరు రోడ్డు ప్రమాదంలో చనిపోయిన సందర్భంగా ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు భీమడోలు మండలానికి చెందిన ఉపాధ్యాయులు ముందుకు రావడం అభినందనీయమని భీమడోలు ఎంఇఒలు శ్రీనివాసరావు, భాస్కర్‌కుమార్ అన్నారు. మండల వనరుల కేంద్రంలో విద్యాశాఖ మెసేంజర్‌గా పనిచేస్తున్న బాలిన రామకృష్ణ రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ మృతి చెందారు. ఎంఇఒల విజ్ఞప్తి మేరకు ఉపాధ్యాయులు స్పందించారు. రూ.85,500 నగదును విరాళాలుగా సేకరించారు. భీమడోలు హైస్కూల్లో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సదరు మొత్తాన్ని మృతుడు బాలిన రామకృష్ణ కుటుంబానికి ఉపాధ్యాయులు ఎంఇఒల ద్వారా అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ మృతుని కుటుంబానికి ప్రభుత్వపరంగా రావాల్సిన మొత్తాలు త్వరితగచ్చిన వచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు.

నిర్ణీత సమయంలో సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు అర్జీల ద్వారా అందించిన సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించనున్నట్లు సబ్ కలెక్టర్ బి.వినూత్న తెలిపారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. నూజివీడు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సబ్ కలెక్టర్‌కు అందించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ వినూత్న మాట్లాడుతూ ప్రతి అర్జీ ఆన్‌లైన్ చేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోపు అన్ని సమస్యలు పరిష్కరించనున్నట్లు చెప్పారు. జటిలమైన సమస్యలు పరిష్కారం కాకుంటే వాటి వివరాలను అర్జీదారులకు వివరిస్తామన్నారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రజలు మొత్తం 50 రకాలైన సమస్యలను అర్జీల రూపంలో అందించినట్లు తెలిపారు. వివిధ శాఖలకు చెందిన డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ముసునూరు :ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పిజిఆర్ఎస్ ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించనున్నట్లు రెవెన్యూ తహశీల్దార్ డి.ప్రశాంతి చెప్పారు. మండల కేంద్రమైన ముసునూరు రెవెన్యూ కార్యాలయంలో సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని పలువురు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అర్జీలు అందించారు.

చోరీ సొమ్ము రికవరీ చేయాలి

ఎస్‌పికి సువర్ణరాజు వినతి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల గ్రామం శివారు గుండుగొలనుకుంట కాలనీ వద్ద జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు చిలుకూరి ఫణి కుటుంబ సభ్యులు నిర్మించిన శ్రీ కండిగలమ్మ ఆలయంలో జులై నాలుగో తేదీన చోరీ జరిగింది. ఈ చోరీలో సుమారు రూ.ఐదు లక్షల విలువైన బంగారు, వెండి వస్తువులు దొంగలు అపహరించుకుపోయారు. నాలుగు నెలలు అయినప్పటికీ ఈ కేసులో ఎటువంటి పురోగతి లేకపోవడంతో సోమవారం జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు ఎస్‌పిని ఆయన కార్యాలయంలో సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. రూ.లక్షలు వెచ్చించి ఆలయం నిర్మించారని, త్వరితగతిన ఆ కేసు విచారణ పూర్తి చేసి సొమ్మును రికవరీ చేయాలని కోరారు. ఎస్‌పి అక్కడ నుంచే ద్వారకాతిరుమల ఎస్ఐతో ఫోన్‌లో మాట్లాడారు. కేసు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐ సుధీర్‌కు ఎస్‌పి కొన్ని ఆదేశాలిచ్చారు. త్వరలో ఈ కేసు పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్‌పి హామీ ఇస్తూ ఆలయంలో సీసీ కెమెరాలు తప్పకుండా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉపాధ్యక్షులు చిలుకూరి ఫణి, సీనియర్ నాయకులు తరగళ్ల శ్రీనివాసరావు, పి.కన్నాపురం జనసేన పార్టీ అధ్యక్షులు పండు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి

ప్రజాశక్తి - మండవల్లి

చిన్నారికి విద్యకు బీజం పడేది అంగన్వాడీలోనే అని కానుకొల్లు సర్పంచి నాగదాసి థామస్ స్పష్టం చేశారు. కానుకొల్లు కాలనీలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీల నుంచి చిన్నారులకు విద్య ప్రారంభమవుతుందన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్యను నేర్పించడంతోపాటు పౌష్టికాహారం అందుతుందన్నారు. తప్పకుండా చిన్నారులను అంగన్వాడీలకు పంపించి చిన్నారుల విద్యాభివృద్ధికి మంచి బాటలు వేసుకోవాలని ఆయన తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కొండలు, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని కన్నాపురం గ్రామానికి చెందిన మిషన్ టైలర్ రాజేష్ తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందుతున్న సందర్భంలో ఆయనకు ఆర్థిక సహాయం అందిస్తూ శ్రీ విలియం హోమ్ గణపతి రామా టైలర్స్ సేవా సంఘం ముందుకొచ్చింది. రాజేష్ వైద్య ఖర్చుల కోసం రూ.ఐదు వేల ఆర్థిక సహాయాన్ని సంఘం తరపున అందించినట్లు సంఘ అధ్యక్షుడు తాడిగడప ఆంజనేయరాజు తెలిపారు. ఆపదలో ఉన్న టైలర్స్ కుటుంబాలకు అండగా నిలవడం సంఘం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టైలర్స్ సంఘ సభ్యులు సోనీ టైలర్, స్వాగత్ టైలర్, గంగోత్రి టైలర్, డిస్కో టైలర్, స్వామి టైలర్, గ్లొసి టైలర్, సిరి టైలర్, సాకేత్ టైలర్, లక్ష్మి టైలర్, తదితరులు పాల్గొన్నారు.

కొర్లగుంటలో భారీ అన్నసమారాధన

ప్రజాశక్తి - ముసునూరు

మండల పరిధిలోని కొర్లకుంటలో ఉన్న శ్రీ గుర్రాలమ్మ, గుర్రాలయ్య కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం 11.39 గంటలకు వేద పండితులు లక్ష్మీ నరసింహాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అనంతరం ఏడు వేల మందికి భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

కాలు జారి వాగులో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

దేవుడికి పూజ చేసిన పూలు, పండ్లు వంటి పూజా సామగ్రిని వాగులో కలుపుదామని వెళ్లి కాలు జారి ప్రమాదవశాత్తు వాగులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని చిన్నాగిరిపల్లి గ్రామానికి చెందిన వర్ణకవి రాజేష్ రాజు(42) గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలో ఎచ్‌సిఎల్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఇంట్లో పూజ చేసిన పూజా ద్రవ్యాలను చిన్నాగిరిపల్లి-తోటపల్లి గ్రామాల మధ్యలో ఉన్న కంపెనీ వాగులో కలపడానికి వెళ్లాడు. తన ద్విచక్ర వాహనాన్ని రోడ్డుపై పెట్టి పూలను నీటిలోని కలపడానికి దిగి ప్రమాదవశాత్తు నీటిలో పడి ఊపిరాడక మృతి చెందాడు. మృతుడి భార్య వర్ణకవి లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కోడిపందేల స్థావరాలపై దాడి

ప్రజాశక్తి - చింతలపూడి

కోడిపందేల స్థావరంపై దాడి చేసిన పోలీసులు 12 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నగదు, కోడిపుంజులు, సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పట్టాయగూడెంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు చింతలపూడి ఎస్ఐ సతీష్‌కుమార్ తన సిబ్బందితో సోమవారం దాడి చేశారు. ఈ దాడిలో 12 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.10,400 నగదు, సైకిళ్లు, నాలుగు కోడిపుంజులు స్వాధీనం చేసుకున్నారు.

ముసునూరు : కోడిపందేల స్థావరంపై దాడి చేసిన పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ చిరంజీవి తమ సిబ్బందితో మండల పరిధిలోని కాట్రేనిపాడులో ఆదివారం రాత్రి దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి ఒక కోడిపుంజు, 12 కత్తులు, రూ.2500 నగదు, ఒక బైకు స్వాధీనం చేసుకున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

సమస్యలుంటే తెలియజేయండి

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఎక్కడ ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ప్రజలకు సూచించారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంలో పరిష్కరించాల్సిన సమస్యలను లోక్‌సభలో ప్రస్తావించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సంబంధించిన ప్రశ్నలను విద్యార్థులు ప్రజల నుంచి ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ ఆహ్వానించినట్లు బహిరంగ ప్రకటన ద్వారా తెలిపారు. విద్యార్థులు, ప్రజల నుంచి వచ్చిన వాటిలో ఉత్తమమైన కొన్ని ప్రశ్నలను ఎంపిక చేసి వాటిని ప్రజల తరఫున ఎంపీ పార్లమెంట్‌లో ప్రస్తావిస్తారని చెప్పారు. అదేవిధంగా భారతదేశ అత్యున్నత వ్యవస్థ అయిన పార్లమెంటుకు ఆహ్వానించి ఒకరోజు విజిటర్స్ గ్యాలరీలో కూర్చునే అవకాశం కల్పిస్తానని ప్రకటించారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ఏలూరు పార్లమెంట్ పరిధిలోని సమస్యలు, అభివృద్ధి పనులపై ప్రశ్న పంపించాలని ఎంపీ కోరారు. ప్రశ్నలను నేరుగా 9618194377, 9885519299 నెంబర్లకు వాట్సాప్ ద్వారా పంపించాలని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

జిల్లాలో తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు సోమవారం నూజివీడు ప్రాంతంలో అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ జ్యోతిబసు ఆధ్వర్యంలో, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించడం కోసం ఒక సంయుక్త తనిఖీ బృందం హనుమాన్ జంక్షన్ నూజివీడు రహదారిలో పర్యటించింది. నూజివీడు రూరల్ ఎస్ఐ జ్యోతిబసు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.దుర్గావిఠల్, ఎన్‌హెచ్ జూనియర్ ఇంజినీర్ దేవర సారథ్ చంద్రమూర్తి, డిటిఆర్‌బి ఈ బృందంలో ఉన్నారు. ఈ సంయుక్త బృందం పలు ప్రాంతాలను పరిశీలించింది. ముఖ్యంగా ప్రమాదాలు అధికంగా చోటు చేసుకుంటున్న ప్రాంతాలుగా మీర్జాపురం, తుక్కులూరు, గొల్లపల్లి, సీతంపేట క్రాస్ రోడ్లు, ఎంఆర్ అప్పారావు కాలనీలను గుర్తించారు. ఈ ప్రమాద ప్రాంతాల్లో రోడ్డు భద్రతను మెరుగుపరచడానికి రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరగకుండా తగిన లైటింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేయడం, ప్రమాద సూచనలు తెలిపే హెచ్చరిక బోర్డులను, వేగ నియంత్రణ బోర్డులను ఏర్పాటు చేయడం, అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు లేదా రంబుల్ స్ట్రిప్స్‌ను ఏర్పాటు చేయడం వంటి నివేదికను, సిఫార్సులతో సహా ఎస్‌పి, కలెక్టర్‌కు అందిస్తామని తెలిపారు.

కైకలూరును కృష్ణా జిల్లాలో కలపాలి : వైష్ణవి

ప్రజాశక్తి - ముదినేపల్లి

కైకలూరు నియోజకవర్గాన్ని తిరిగి కృష్ణా జిల్లాలో కలపాలని అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి కోరారు. సోమవారం ముదినేపల్లిలో ఆమె మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం నియోజవర్గంలోని నాలుగు మండలాలైన కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి, కలిదిండి మండలాలను జిల్లాలో విలీనం చేయడంతో ఇటు ప్రజలు, అటు రైతులు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. దీంతో ప్రజలు తాగడానికి నీళ్లు లేవని, పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై మరోసారి సిఎం చంద్రబాబును కలిసి వినతి పత్రం ఇస్తామన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు కోర్టు వేదికగా డిసెంబర్ 13వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమ సేవలను వినియోగించుకోవాలని భీమడోలు లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్‌పర్సన్ ఎస్.ప్రియదర్శిని కోరారు. భీమడోలు కోర్టు పరిధిలోని భీమడోలు, ద్వారకాతిరుమల, దెందులూరు మండలాలకు చెందిన ప్రజలు కార్యక్రమ సేవలను వినియోగించుకోవచ్చన్నారు. ఇదే క్రమంలో రాజీ మార్గం ద్వారా కేసుల పరిష్కారం, ఇతర అంశాల గురించి వివరించారు. కోర్టు ద్వారా గత సెప్టెంబర్ నెలలో నిర్వహించిన లోక్ ఆదాలత్ ద్వారా 86 కేసులు పరిష్కారమయన్నారు. ఇదే క్రమంలో డిసెంబర్ నెలలో నిర్వహించే లోక్ అదాలత్ ద్వారా,158 కేసుల వరకు పరిష్కారమయ్యేందుకు అర్హమైనవిగా గుర్తించామన్నారు.

చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ జయంతి

ప్రజాశక్తి - కలిదిండి

తెలుగు సాహిత్య రంగానికి విశేష సేవలందించిన చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ జయంతిని పురస్కరించుకుని స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కడపలో ఆయన నివసించిన స్థలంలో బ్రౌన్ గ్రంథాలయం నిర్మించారని, అది 2006లో భాషా పరిశోధన కేంద్రం యోగివేమన విశ్వవిద్యాలయంలో బాగమైందని, సిపి బ్రౌన్ తెలుగు - ఇంగ్లీష్ నిఘంటువు ఇప్పటికీ ప్రామాణికంగా ఉపయోగిస్తున్నారనే పలు అంశాలను విద్యార్థులకు స్థానిక శాఖా గ్రందాలయాధికారి కె.రమేష్‌బాబు వివరించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్ల శిక్షణను ప్రారంభించాలి : ఎఐవైఎఫ్

ప్రజాశక్తి - చింతలపూడి

రాష్ట్ర పోలీస్ శాఖలో ఎంపికైన కానిస్టేబుళ్ల శిక్షణను తక్షణమే ప్రారంభించాలని కోరుతూ అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) జిల్లా కో కన్వీనర్ తొర్లపాటి రాజు చింతలపూడి తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. నియామక ప్రక్రియ ప్రారంభమై నాలుగేళ్లు గడిచినప్పటికీ శిక్షణ తరగతులు ప్రారంభం కాలేదని, దీంతో వేలాది మంది యువకుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని చెప్పారు. రాష్ట్ర పోలీస్ శాఖలో ఎంపికైన 6,100 మంది కానిస్టేబుళ్ల శిక్షణ షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని, శిక్షణ కార్యక్రమాలను తక్షణమే ప్రారంభించి, నియామక ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు నక్క వంశీ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే 'మీకోసం'

ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రజా సమస్యలు పునరావృతం కాకుండా పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ తెలిపారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఫిర్యాదుదారుల వద్ద నుంచి ఎస్‌పి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్‌లోనే ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచే విధంగా పోలీసు శాఖ అడుగులు వేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి 49 ఫిర్యాదులు అందాయని, వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలు సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్

గుర్తుతెలియని వ్యక్తులు ఎవరైనా సమాచారాన్ని కోరినా, సమాచారాన్ని తెలుసుకునేందుకు ప్రయత్నించినా వెంటనే 1930 నెంబర్ కు ఫోన్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. డిజిటల్ అరెస్ట్‌ల వ్యవహారాల్లో కూడా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎవరైనా వీడియో కాల్ ద్వారా తాము పోలీసులమని, అధికారులమని బెదిరింపులకు పాల్పడితే వెంటనే స్థానిక పోలీసులకు లేదా సైబర్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి నక్క సూర్యచంద్రరావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ఉచిత గోనెసంచులు

ప్రజాశక్తి - పోలవరం

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు ఉచితంగా నాణ్యమైన గోనెసంచులు అందించనున్నట్లు వ్యవసాయాధికారి కె.రాంబాబు అన్నారు. మండలంలోని ఆరు ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బంది, వ్యవసాయ సహాయకులు, సొసైటీ సెక్రటరీలకు, ఖరీఫ్ 2025 సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, బాధ్యతలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ బి.సాయిరాజు, ఎంపిడిఒ సిహెచ్.శ్రీనివాస్‌బాబు, డిప్యూటీ ఎంపిడిఒ రవికుమార్, మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఈ సీజన్ కోసం కామన్ రకం క్వింటాకు రూ.2,369, గ్రేడ్ ఎ రకం క్వింటాకు రూ.2,389 మద్దతు ధరగా నిర్ణయించిందని అధికారులు తెలిపారు. రైతులు తీసుకొచ్చే ధాన్యం తేమ శాతం 17 శాతం లోపు ఉండాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు ఉచితంగా నాణ్యమైన గోనసంచులు అందించనున్నట్లు తెలిపారు. అదనంగా లేబర్ ఛార్జీలు, రవాణా ఖర్చులు కూడా ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. గోనెసంచుల సరఫరా, రవాణా తదితర అంశాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ సాగేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, విఆర్ఒలు, ధాన్యం కొనుగోలు సిబ్బంది, సొసైటీ సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక సమస్య పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని పి.కన్నాపురం గ్రామంలో ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని ఎస్‌సిల శ్మశానవాటిక సమస్యను పరిష్కరించాలని గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు కోరారు. ఈ మేరకు ఆయన ద్వారకాతిరుమల తహశీల్దార్ సుబ్బారావుకు వినతిపత్రం అందించారు. స్వాతంత్రం వచ్చి 70 ఏళ్లు దాటినప్పటికీ దళితుల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం కావడం లేదని, పి.కన్నాపురం శ్మశానానికి చనిపోయిన వ్యక్తి మృతదేహాన్ని చేల గట్ల పైనుంచి, పంట బోదెల్లోంచి తీసుకెళ్లాల్సిన దుర్భర పరిస్థితి చోటు చేసుకుందని తెలిపారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎంతమంది నాయకులు మారినా ఈ సమస్య పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ఈ శ్మశానం సమస్య పరిష్కారానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. గతంలో వెళ్లి పరిశీలిద్దామనుకున్నప్పటికీ అత్యవసర పని ఒత్తిడి మేరకు వెళ్లలేకపోయామని, ఈ నెల 14వ తేదీన పి.కన్నాపురం గ్రామం వెళ్లి సమస్యను పరిశీలిస్తానని తహశీల్దార్ సుబ్బారావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు చిలుకూరి ఫణి, సీనియర్ నాయకులు తరగళ్ల శ్రీనివాసరావు, పి.కన్నాపురం, పార్టీ గ్రామ అధ్యక్షులు పండు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ దుర్మార్గం

మాజీ ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు

ప్రజాశక్తి - ఉంగుటూరు

గత వైసిపి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రయివేటుపరం చేయడం దుర్మార్గమని మాజీ ఎంఎల్ఎ, ఆ పార్టీ పిఎసి సభ్యులు పుప్పాల వాసుబాబు అన్నారు. నారాయణపురంలో సోమవారం రాత్రి నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మండల కమిటీ కన్వీనర్ మరడ మంగారావు అధ్యక్షత వహించారు. వాసుబాబు మాట్లాడుతూ జగన్ 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను తీసుకోస్తే నేడు కూటమి ప్రభుత్వం వాటిని పిపిపి పద్ధతిలో ప్రయివేట్ వ్యక్తులకు కట్టబెట్టటం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షులు అరుణ్ కుమార్, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యులు కోరిపల్లి జయలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు అరవెల్లి మహాలక్ష్మి దానయ్య, రాయి లక్ష్మి, ఎంపిటిసిల ఛాంబర్ మండలాధ్యక్షులు బండారు నాగరాజు, నాయకులు పుప్పాల గోపీ, దొంతంశెట్టి సత్యనారాయణ, మంద జయలక్ష్మి, గోలి రామారావు, పుచ్చకాయల విష్ణుమూర్తి, అడపా శ్రీనివాసరావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కుక్కునూరు : మండలంలో వైసిపి ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఈ నెల 12వ తేదీన పోలవరం నియోజకవర్గంలో నిర్వహించనున్న నిరసన ర్యాలీకి సంబంధించిన ప్రజా ఉద్యమం పోస్టర్లను పార్టీ మండలాధ్యక్షులు తాండ్ర రాజేష్ ఆవిష్కరించారు. మండలంలోని శివాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు జరగనున్న ఈ భారీ ర్యాలీలో ప్రజలు, ఉద్యమ పార్టీలు స్వచ్ఛందంగా పాల్గొని కూటమి ప్రభుత్వ దుర్మార్గ విధానాలకు వ్యతిరేకంగా గళమెత్తాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి గాడిద రామచంద్రం, నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌ఛార్జి మల్లేల చంటి నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి పగిళ్ల అల్లేశ్, భూపతి చిన్న రంగరాజు, కుక్కునూరు ప్రసాద్, కొండపల్లి రమేష్, సాయిల ఏసు, ఎస్‌కె.అమీర్ పాషా, మచ్చ మల్లేష్, కోమాల్లా పవన్ తదితరులు పాల్గొన్నారు.

పీజీ విద్యార్థుల భారీ ర్యాలీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిగీతం వందేమాతరానికి 150 వసంతాలు పూర్తయిన సందర్భంగా సర్ సిఆర్.రెడ్డి పీజీ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం సిఆర్.రెడి పిజి కళాశాల నుంచి ఫైర్ స్టేషన్ సెంటర్ వరకు అధ్యాపకులు, విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏలూరు డిఎస్‌పి డి.శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ వందేమాతరానికి 150 వసంతాలు పూర్తయిన సందర్భంగా దేశం అంతటా ఎంతో ఘనంగా ఒక పండగ జరుపుకోవడం చాలా అనందదాయకమన్నారు. ముందుగా పిజి కళాశాల కరస్పాండెంట్ కానాల శ్రీనివాసరావు జాతీయ జెండాను ఊపి ర్యాలీ ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.రామరాజు మాట్లాడుతూ వందేమాతర గీతం రచించిన బంకిం చంద్ర ఛటర్జీ బ్రిటీష్ పాలనలో ఆయన పడిన అవమాన గాయం నుంచి పుట్టుకొచ్చిన గీతమే మన వందేమాతర గీతమన్నారు. పిజి కళాశాల డైరెక్టర్ డాక్టర్ విఆర్ఎస్.బాబు మాట్లాడుతూ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సమస్త జాతిని మేలు కొలిపి ఒకటిగా చేసిన మహోద్యమ సమర నినాదమే మన వందేమాతరం అని అన్నారు. బంకిం చంద్ర ఛటర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యక్రమ కో-ఆర్డినేటర్ డాక్టర్ తేరా రాజేష్, వైస్ ప్రిన్సిపల్ కె.విశ్వేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతు బజార్ వికేంద్రీకరణ జరగాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని ధర్మ అప్పారావు కళాశాల రోడ్డులో ఉన్న రైతు బజార్ పూర్తిస్థాయిలో వికేంద్రీకరణ జరగాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు అన్నారు. ఈ మేరకు నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్‌కు సోమవారం మీకోసం కార్యక్రమంలో అర్జీ దాఖలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతు బజార్ నిర్వహణ అధ్వానంగా ఉందన్నారు. అనేక షాపులు శిథిలావస్థ స్థితికి చేరుకున్నాయని, కూరగాయల వ్యర్థాలను బయట పోయడంతో మూగజీవాలు చేరుకుని గుంపులు గుంపులుగా ఉండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ రైతు బజారుకు ఎదురుగానే ప్రయివేట్ కూరగాయల మార్కెట్ కొనసాగుతూ ఉండడం వల్ల మరింత ట్రాఫిక్ సమస్య పెరుగుతోందన్నారు. ట్రాఫిక్ నివారణ కోసం పట్టణానికి నాలుగు వైపులా రైతు బజార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విధంగా రైతు బజార్ వికేంద్రీకరణ జరగడం ద్వారా ఏ దిశలోని ప్రజలు ఆ దిశలోనే కూరగాయలు కొనుగోలు చేయడంతో, పట్టణంలో ట్రాఫిక్ సమస్య 50 శాతం తగ్గుతుందన్నారు. ఈ దిశగా మార్కెటింగ్ శాఖ, రెవెన్యూ, మున్సిపల్, ఆర్అండ్‌బి, పోలీస్ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సరైన సమయంలో తగిన విధంగా నిర్ణయం తీసుకోవాలన్నారు. రాను రాను ఈ సమస్య మరింత జటిలం కాకముందే త్వరితగతిన అధికారులు మేల్కొని సమస్యను పరిష్కరించి రైతు బజార్ వికేంద్రీకరణ దిశగా అడుగులు వేయాలని కోరారు.

In the Court of the III Additional District Judge at Kakinada
O.S. No. 86/2018

Between:
Anupoju Satyanarayana ...*Plaintiff*
AND
Mathurthi Ratna Kumari & others ...*Defendants*

To:
D-6: Mathurthi Brahmaji, S/o. (late) Satyanarayana, R/o. Inam, Tallarevu Mandal, Kakinada District.
D-7: Mathurthi Govindamma @ Padma, W/o. (late) Vara Prasadu, House wife, Tallarevu, Tallarevu Mandal, Kakinada District.
D-10: Girijala Varalakshmi, W/o. Nageswara Rao, House wife, Tanuku, Tanuku Mandal, West Godavari District.
D-13: Pedapati Baby, W/o. Achari, House wife, Marteru, Tanuku Mandal, West Godavari District.

పై నెంబరు దావాలో 6వ, 7వ, 10వ మరియు 13వ ప్రతివాదులు అయిన మీకు శ్రీ కోర్టు వారు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం ది. **18-11-2025 సంగరం తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గంII 10.30 నిIIలకు** స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
టి.వి.నరసింహారావు, అడ్వకేట్
కొత్తపేట, సెల్: 9849083925

నూజివీడును ఎన్‌జిఆర్ జిల్లాలో కలిపేందుకు సుముఖతపై హర్షం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ప్రాంత ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాన్ని మంత్రివర్గ సమావేశంలో నూజివీడును ఎన్‌టిఆర్ జిల్లాలో కలిపేందుకు సుముఖత వ్యక్తం చేసిన నేపథ్యంలో నూజివీడు సిటిజన్ ఫారం ఆధ్వర్యంలో సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ పట్టణంలోని చిన్న గాంధీ బొమ్మ సెంటర్ వద్ద సోమవారం థాంక్యూ సిఎం సార్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సిఆర్‌డిఎ పరిధిలో ఉన్న నూజివీడును తిరిగి ఎన్‌టిఆర్ జిల్లాలో కలపటం వల్ల నియోజకవర్గ అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందన్నారు. తద్వారా యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సిటిజన్ ఫారం ప్రతినిధి మల్లిపూడి రాజశేఖర్, సిటిజన్ ఫారం ప్రతినిధి, కుమార్ విద్యాసంస్థల అధినేత పివి.కుమార్, సిటిజన్ ఫారం ప్రతినిధి న్యాయవాది సయ్యద్ ఫరూక్, లయన్స్ క్లబ్ పట్టణ అధ్యక్షులు రాజు పాల్గొన్నారు.

12న సీజ్డ్ వాహనాలకు వేలం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ ఎక్సైజ్ నేరాల్లో సీజ్ చేసిన వాహనాలపై ఈ నెల 12వ తేదీన వేలం పాట ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సిఐ మస్తానయ్య తెలిపారు. వేలంపాటలో పాల్గొనాలనుకున్నవారు ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట ధరకు పాట పాడిన మొత్తంపై 18 శాతం సేల్స్ టాక్స్ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాల కోసం నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌ను సంప్రదించవచ్చునని, 9440902462కు కాల్ చేయవచ్చని తెలిపారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

దెందులూరు: ఏలూరు రూరల్ మండలంలోని మానూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు, తల్లిదండ్రుల సమక్షంలో సెమిస్టర్-2 పాఠ్య పుస్తకాలను ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ఇచ్చినట్లు ప్రధానోపాధ్యాయులు తేర ప్రసాద్, ఉపాధ్యాయురాలు తాలాడ అరుణ, పేరం శిరీష, తేర సుభాషిని, తేరా సంధ్యారాణి, గొట్టికల రజిని, బ్యులా, జ్యోతి పాల్గొన్నారు.

ప్రకటన

ఈ క్రిందినుదహరించిన నా మారుతీ స్విఫ్ట్ రి నెం : AP16CC6139 కారు సెప్టెంబర్ 30, 2025 నుంచి కనిపించుట లేదు. కార్ డాష్ బోర్డులో బ్యాంకు అఫ్ ఇండియా చెక్కు (నెంబర్.025615) కూడా ఉంది. కనుక సదరు డేట్ నుంచి ఈ కారుకు, చెక్కుకు చెందిన ఏ లావాదేవీలు చెల్లవు & నాకు సంబంధించవు. పై కారు కు సంబందించి సమాచారం తెలిస్తే ఈ క్రింది వారికి తెలియచేయండి.

జన్ను వినయ్ కుమార్
సెల్: 8639792488.

పాస్‌పోర్టు పోయినది

వేగేశ్న రామచంద్రరాజు, తండ్రి.: రామచంద్ర రాజు, డోర్ నెంబర్ 6-10-1/1, సుగర్ కాలనీ, పాలకొల్లు, ప.గో.జిల్లా, ఎ.పి ప్రజలకు తెలియ జేయునది ఏమనగా నేను వైజాగ్ పాస్‌పోర్ట్ ఆఫీస్ నుంచి B1058685 నెంబర్ పాస్‌పోర్ట్ పొందాను. అది పడిపోయాక నేను ది 20-07-2019లో హైదరాబాద్ పాస్‌పోర్ట్ ఆఫీస్ నుంచి G173792 నెంబర్ పాస్‌పోర్ట్ పొంధియున్నాను. ది.10-08-2025న పాలకొల్లులోని మా ఇంటి నుంచి పాలకొల్లులోని జెరాక్స్ సెంటర్‌లో నా పాస్‌పోర్ట్ జెరాక్స్ తీయించుటకు బైక్ పై వెళుతుండగా దారిలో నా ఒరిజినల్ పాస్ పోర్ట్ పడిపోయినది. ఎంత వెతికిన ఎక్కడ దొరకలేదు. ఎవరికైన దొరికిన పై నా అడ్రస్‌కు నా ఒరిజినల్ పాస్ పోర్ట్ అందజేయగలరు.
నా సెల్ నెంబర్ **9849922622**

వేలం ప్రకటన
మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.No.27/2024
in O.S.No.67/2017

DHR: దేవ కోటేశ్వరరావు
Vs
JDr's:
1.గ్రంధి కనకదుర్గ
2.గ్రంధి పార్వతి

డిక్రీ బాకీ రాబట్టుకొనుటకు గాను 2వ JDR తాలుకు యీ దిగువ తెలియపర్చిన ఆస్తిని ది.26-11-2025వ సంగరం తేదీ ఉదయం 10.30 నిIIలకు పైకోర్టు వారి ఎదుట వేలం వేయబడును. కావలసిన వారు వచ్చి పాడుకొనవచ్చును.

షెడ్యూలు

West Godavari District, Mogalthuru SRO Mogalthuru Mandal Ramannapalem Village Zeroyati wet land an extent of Ac.0.25 cents in R.S.No.1162/2 with in the following boundaries :
East : Land belongs to Grandhi Madhuram and Grandhi Venkatesh
South: Land belongs to Kukkala Veera Swamy
West : Land belongs to Grandhi Kanaka Durga
North: Land belongs to Kukkala Satyanarayana
With all usual, easementary rights
DHR Value : 5,00,000/-
Amin Value : 8,00,000/-
JDR Value : More than 50,00,000/-

Challa Danayyanaidu
నరసాపురం Advocates, Narsapuram.
తేది.7-11-25 Cell: 9441086919

వేలం ప్రకటన
మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.No.27/2024
in O.S.No.67/2017

DHR: దేవ కోటేశ్వరరావు
Vs
JDr's:
1.గ్రంధి కనకదుర్గ
2.గ్రంధి పార్వతి

డిక్రీ బాకీ రాబట్టుకొనుటకు గాను 2వ JDR తాలుకు యీ దిగువ తెలియపర్చిన ఆస్తిని ది.26-11-2025వ సంగరం తేదీ ఉదయం 10.30 నిIIలకు పైకోర్టు వారి ఎదుట వేలం వేయబడును. కావలసిన వారు వచ్చి పాడుకొనవచ్చును.

షెడ్యూలు

West Godavari District, Mogalthuru SRO Mogalthuru Mandal Ramannapalem Village Zeroyati wet land an extent of Ac.0.25 cents in R.S.No.1162/2 with in the following boundaries :
East : Land belongs to Grandhi Madhuram and Grandhi Venkatesh
South: Land belongs to Kukkala Veera Swamy
West : Land belongs to Grandhi Kanaka Durga
North: Land belongs to Kukkala Satyanarayana
With all usual, easementary rights
DHR Value : 5,00,000/-
Amin Value : 8,00,000/-
JDR Value : More than 50,00,000/-

Challa Danayyanaidu
నరసాపురం Advocates, Narsapuram.
తేది.7-11-25 Cell: 9441086919